సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



బంగారం రికవరీ పేరిట వేధింపులా?

చోరీ జరిగిన బంగారాన్ని రికవరీ చేయడం పేరిట బంగారు దుకాణ యజమానులను వేధించడం సమంజసం కాదని జరుగు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. -8లో



రుణమో.. రామచంద్రా!

రుణాల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తు దారులు కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి తరలి రావడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.6/18.4

జిల్లాలో బుధవారం 18.4 - 36.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'స్టాఫ్ నర్స్' ప్రొవిజినల్ మెరిట్ జాబితా విడుదల

కడప రూరల్: కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు, వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. ఈ జాబితాను సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 22వ తేదీలోపు తమ అభ్యర్థనలను తెలపాలని సూచించారు. 28వ తేదీన ఫైనల్ మెరిట్ జాబితాను ప్రకటిస్తామని వివరించారు.

23న హాకీ సీనియర్ పురుషుల జిల్లా జట్టు ఎంపిక

పులివెందుల టౌన్: పట్టణంలోని స్థానిక వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ టర్ఫ్ హాకీ గ్రౌండ్‌లో ఈనెల 23న ఆదివారం ఉదయం హాకీ సీనియర్ పురుషుల జిల్లా జట్టు ఎంపికలు జరగనున్నాయని హాకీ జిల్లా సెక్రటరీ ఎం.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన హాకీ క్రీడాకారులు మార్చి 6 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పురుషుల హాకీ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ఎంపికలకు పాల్గొనే క్రీడాకారులు 01-01-1991 తర్వాత 31-12-2005 ముందు జన్మించి ఉండాలని వివరించారు. క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: పోరుమామిళ్ల పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఈనెల 21వ తేదిన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ నిర్వహించే ఈ జాబ్‌మేళాలలో నవత ట్రాన్స్‌పోర్టు కంపెనీలో క్లర్క్, డ్రైవర్, క్లీనర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అలాగే డానో బీపీఓ అండ్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో టెలికాలింగ్ ఆఫీర్, ఎల్‌ఐసీలో బీమా సాక్షి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.. ఎంపికైన వారికి రూ.7 వేల నుంచి రూ. 35 వేల వరకు వేతనం హోదాను బట్టి లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఫర్నీచర్ సరఫరాకు కొటేషన్లు ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప స్పెషల్ పోక్సో కోర్టు కోసం కొత్త ఫర్నీచర్ వస్తువుల సరఫరా కోసం సీల్డ్ కొటేషన్లు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ జడ్జి జి. శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అన్ని టాక్స్‌లతో కలుపుకొని 7 ఐరన్ అల్మారాలు, 1ఐరన్ ర్యాక్, 8 ఆఫీసు టేబుల్స్, 3 కుషన్ చైర్స్, 30 'ఎస్' టైప్ మార్క్ చైర్స్, ఒక క్రోస్ చైర్, 5 ఐరన్ స్టూల్స్, 2 కోట్ హ్యాంగర్స్, 3 ఉడెన్ బెంచులు, ఒక సోఫా సెట్, 5 టీ పాయి, ఒక డ్రైనింగ్ టేబుల్, ఒక ప్లాస్టిక్ చైర్ మొత్తం 13 రకాల ఫర్నిచర్ వస్తువుల కోసం సీల్డ్ కొటేషన్లు ఆహ్వానిస్తున్నామన్నారు.టెండరుదారు సమర్పించే కొటేషన్ కవరు పైన 'కొటేషన్ ఫర్ సప్లయ్ అండ్ ఇన్‌స్టాలేషన్ ఫర్ ఫర్నీచర్ ఐటమ్స్'అని రాయాలన్నారు. నమోదు చేసిన సంబంధిత షీల్డు కొటేషన్లను ఈనెల 21వతేది సాయంత్రం 5 గంటల లోపు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు, కడపలో సమర్పించాలన్నారు. వివరాల కోసం వెబ్ సైట్ కడప.డికోర్ట్స్.జీఓవీ.ఇన్‌లో చూడవచ్చని, అలాగే 08562-254963 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లాకు యూరియా రాక




రైలు ర్యాక్ నుంచి లారీలకు లోడ్ చేస్తున్న యూరియా

కడప అగ్రికల్చర్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు బుధవారం 2600 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు వెల్లడించారు. ఇందులో వైఎస్సార్‌జిల్లాకు 1300 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రైవేటు డీలర్లకు కేటాయించగా మరో 1000 మెట్రిక్ టన్నుల యూరియాను మార్క్‌ఫెడ్‌కు అలాట్ చేసినట్లు వివరించారు. అలాగే అన్నమయ్య జిల్లాకు సంబంధించిన మార్క్‌ఫెడ్‌కు 300 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించామని పేర్కొన్నారు. రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు తెలిపారు.

పుట్టా మాటలకు అర్థాలే వేరులే!

- అధికారుల్లో అవినీతి పేట్రేగిపోతోందని పుట్టా వ్యాఖ్య
- దందాలతో మునిగితేలుతున్న పచ్చ నేతలను కట్టడి చేయని వైనం
- 'తమ్ముళ్ల' ఆక్రమణలపై ఎమ్మెల్యే దృష్టి సారించాలంటున్న మైదుకూరు వాసులు





సాక్షి ప్రతినిధి, కడప: 'అధికారులు అవినీతికి పాల్పడొద్దు. నిజాయితీగా విధులు నిర్వర్తించండి. అధికారులపై అవినీతి ఆరోపణలు అధికంగా వస్తున్నాయి. రెవెన్యూ, పోలీసు, హెల్త్, హౌసింగ్, విద్యుత్, పంచాయితీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బి, రిజిస్ట్రేషన్, అగ్రికల్చర్ శాఖల పరిధిలో అవినీతి ఆరోపణలు నాదృష్టికి వచ్చాయి. ఇదే లాస్ట్ వార్నింగ్. ఇకపై నాదృష్టికి వస్తే అదే ప్రజలచే ఏసీబీకి పట్టిస్తా...' ఇటీవల ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నోటి నుంచి జాలువారిన మాటలివి.

- కూటమి ప్రభుత్వంలో అవినీతి తారా స్థాయికి చేరిందని ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ మాటలు చెప్పకనే చెబుతున్నాయి. దాదాపు అన్ని శాఖలల్లో అవి నీతి అధికారులు తిష్ట వేసి ఉన్నట్లు స్వయంగా ధ్రువీకరించారు. అధికారులు సరే.. మరి 'తెలుగు తమ్ముళ్లు' చేస్తున్న అవినీతి కనిపించలేదా.. వారు చేస్తున్న ఆక్రమణల గురించి చెప్పరా అంటూ కూటమిలోని బీజేపీ నేతలు, ప్రజలు ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రజావసరాలకు అనుగుణంగా మెలగడం సమాజానికి శ్రేయస్కరమే. మరి పేదలకు అందించే రేషన్ బియ్యంతో మొదలు పెడితే అనేక విషయాల్లో తన అను చరులు తలదూరుస్తున్నారు. సామాన్యుల నోటికాడి కూడు లాగేస్తున్నారు. యథేచ్ఛగా దోపిడీ చర్యలను కొనసాగిస్తున్నారు. అలాంటి వారిని కట్టడి చేయడంలో కూడా ఎమ్మెల్యే బాధ్యత తీసుకోవాలి కదా.. అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అవినీతిలో మునిగి తేలుతున్న తమ్ముళ్లను కాదని... అధికారులపైనే ఆరోపణలు చేయడం.. వారిని భయపెట్టించడమేనని తూర్పార బడుతున్నారు. 'పుట్టా వారి మాటలకు అర్థాలే వేరులే' అంటూ ఎద్దేవా చేస్తున్నారు.

గ్రామాల్లో బెల్ట్‌షాపులు..



మైదుకూరు నియోజకవర్గంలో మద్యం యథేచ్ఛగా లభిస్తోంది. ఆయా గ్రామాల్లో బెల్ట్ షాపులు తిష్టవేశాయి. చివరికి బ్రహ్మంగారి మఠం లాంటి ఆధ్యాత్మిక క్షేత్రాల్లో కూడా బెల్ట్‌షాపులు వెలిశాయి. ఆ విషయం తన దృష్టికి కూడా వచ్చిందని స్వయంగా ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ ఓ సందర్భంలో చెప్పారు. ఇప్పటికైనా బెల్ట్ షాపు బ్రహ్మంగారిమఠంలో కట్టడి చేశారా? అంటే లేదు. కట్టడి చేసేందుకు ఎమ్మెల్యే స్థాయికి అది ఎంత పని? వాస్తవంగా ఎక్సైజ్, పోలీసులు అధికారులు తనిఖీలకు వెళితే ఎమ్మెల్యే సహాయకుడు నుంచి వెంటనే అధికారులకు ఫోన్ వస్తున్నట్లు పలువురు పేరు వెల్లడించేందుకు ఇష్టపడని అధికారులు వాపోతున్నారు. అక్రమ కార్యకలాపాలను కట్టడి చేయాలని భావించి చర్యలు చేపడితే ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు నుంచి ఫోన్లు వస్తున్నట్లు వాపోతున్నారు. నిజంగా మైదుకూరులో అవినీతి అధికారులు తిష్టవేసి ఉన్నారా...అధికారులను బెదిరించి దారికి తెచ్చుకోవాలనే తపనతో ఎమ్మెల్యే వ్యాఖ్యానించారా...అన్న విషయం సందిగ్ధంగా ఉందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. అవినీతి అధికారులు తిష్టవేసి ఉంటే అలాంటి వారికి పోస్టింగ్ ఇప్పించిన నాయకులెవ్వరు? విశ్లేషకులు సైతం ప్రశ్నిస్తున్నారు. అధికారుల విధులకు పాలకపక్షం ఆటంకం కల్గించకుంటే అదే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పలువురు వివరిస్తున్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలు...



చాపాడు మండలంలో ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడుతున్నారని ఇటీవల బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు ఎల్‌సీ గోపాల్‌రెడ్డి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సామాన్యులకు అందించాల్సిన రేషన్ బియ్యం పంపిణీ, తూకంలో అక్రమాలకు పాల్పడుతున్నారని వాపోయారు. ప్రధానంగా రేషన్‌షాపు డీలర్లు టీడీపీ నేతలే ఉన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా మాఫియా సైతం మైదుకూరు నియోజకవర్గంలో తిష్ట వేసి ఉంది. అందులో దువ్వూరు మండలంలోని టీడీపీ వర్గీయుడు గిరియాదవ్ పోలీసులకు సైతం పట్టుబట్టారు. చిన్నసింగనపల్లెకు చెందిన మరో టీడీపీ వర్గీయుడు ఏకంగా డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారిపై బెదిరింపులకు దిగారు.

- అంతేనా టీడీపీ నేతలు భూ ఆక్రమణలకూ తెరతీశారు. ఏకంగా సుప్రీంకోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘిస్తూ చెరువులను చెరబట్టారు. వంకలను ఆక్రమించుకున్నారు. ప్రభుత్వ, పరంబోకు భూములు స్వాహా అవుతోన్నాయి. ఇవన్నీ కూడా తెలుగుతమ్ముళ్లు నేతృత్వంలో తెరపైకి వస్తున్నాయి. ఇంకోవైపు ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. అవే విషయాలు పత్రికల్లో పతాక శీర్షికన కథనాలు వచ్చాయి. చిత్తశుద్ధి ఉంటే ప్రజాప్రతినిధిగా పుట్టా సుధాకర్ యాదవ్ స్పందించాలి కదా... కట్టడి చేయాలి కదా... అంటూ విపక్ష పార్టీల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

హంస వాహనంపై శ్రీరంగనాథుడు

ముగిసిన బ్రహ్మోత్సవాలు



హంస వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలో పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథుని కాంప్లెక్స్‌లో ప్రాచీన దేవాలయమైన శ్రీరంగనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజు బుధవారం రాత్రి శ్రీరంగనాథ స్వామి హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పగలు శ్రీర ంగనాథస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ విశేష పూజలు జరిపించారు. చక్రస్నానం చేయించారు. శ్రీరంగనాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి హంసవాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. స్వామి వారికి భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పులివెందుల వాల్మీకి నాట్యమండలి వారిచే సత్యహరిశ్చంద్ర పూర్తి నాటక ప్రదర్శన నిర్వహించారు. పెద్దసంఖ్యలో సందర్శకులు వచ్చి తిలకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ కెవి రమణలు, సభ్యులు పాల్గొన్నారు.

పటిష్టంగా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు

కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

పెండ్లిమర్రి: పొలతల శైవ క్షేత్రంలో మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 25 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పక్కాగా చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. పొలతల క్షేత్రంలోని పర్యాటక భవనంలో బుధవారం సాయంత్రం ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులకు సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పార్కింగ్ స్థలాన్ని పెంచి వచ్చిన వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయించాలన్నారు. అలాగే ఘాట్‌ల వద్ద బారికేడ్‌లు ఏర్పాటు చేయించాలన్నారు. ముఖ్యంగా తాగు నీటికి ఇబ్బందులు రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర సేవలకు 108 అంబులెన్స్ వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు. రోడ్డు మరమ్మతుల పనులు త్వరగా పూర్తి చేయించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, ఈఓ కృష్ణానాయక్, జిల్లా పంచాయతీ రాజ్ అధికారిని రాజ్యలక్ష్మి, తహశీల్దార్ అనురాధ, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి,ఆర్టీసీ, అటవీ అధికారులు పాల్గొన్నారు.



పొలతలలో ఉత్సవాల ఏర్పాట్లును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్

విద్యార్థుల వినూత్న నిరసన

ప్రొద్దుటూరు రూరల్: మండలంలోని గోపవరం గ్రామ సమీపంలో ఉన్న పశువైద్య కళాశాలలో విద్యార్థులు బుధవారం స్టైఫండ్ ఇంగ్లీషు అక్షరాల ఆకారంలో నిలబడి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పశువైద్య కళాశాల విద్యార్థులు మాట్లాడుతూ స్టైఫండ్ పెంచాలని 17 రోజుల నుంచి నిరసన చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. స్టైఫండ్ పెంచాలి.. ప్రభుత్వం స్పందించాలి.. విద్యార్థుల ఐక్యత వర్ధిల్లాలి అని వారు నినాదాలు చేశారు. త్వరలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అపాయింట్‌మెంట్ తీసుకుని ఆయనకు తమ సమస్యను వివరిస్తామన్నారు. మెడికల్ కాలేజీ విద్యార్థులకు సమానంగా తమకు స్టైఫండ్ పెంచి ఇచ్చే వరకు నిరసన కొనసాగిస్తామన్నారు.



స్టైఫండ్ ఆంగ్ల అక్షరాల ఆకారంలో నిలబడి నిరసన తెలుపుతున్న పశువైద్య విద్యార్థులు

భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



వీసీలో పాల్గొన్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో భూముల రీసర్వే వేగవంతంగా పకడ్బందీగా నిర్వహించి నివేదికలు సమర్పించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. బుధవారం విజయవాడ నుంచి భూముల రీ సర్వేపై అదనపు సీసీఎల్‌ఏ నక్కల ప్రభాకర్ రెడ్డితో కలిసి సీసీఎల్‌ఏ జయలక్ష్మి అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీసీఎల్‌ఏ జయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాల్లో భూముల రీ సర్వే పై ప్రత్యేక శ్రద్ధ వహించి పకడ్బందీగా నిర్వహించాలని, నివేదికలు పంపాలన్నారు. ఆ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై క్షేత్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. భూముల రిసర్వే ప్రక్రియ రెవెన్యూ శాఖలో అతి ముఖ్యమైన అంశమని అన్నారు. ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం వహించరాదన్నారు. సీసీఎల్‌ఏ వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కడప కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాల్ లో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రజలకు పౌర సేవలు సంతృప్తి స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలన్నారు. రెవెన్యూ శాఖలో ఎక్కడా కూడా పెండింగ్ అంశాలు లేకుండా చూడాలన్నారు. భూ రికార్డులను సంతృప్తి కరంగా ఏలాంటి లోటుపాట్లను లేకుండా అప్డేట్ చేయాలన్నారు. ఇందుకు ఆయా తహసీల్దార్, వీఆర్‌ఓలు బాధ్యత వహించాలని అన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చిత సమాధానం ఇవ్వాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, సర్వే ల్యాండ్ అధికారి, రెవెన్యూ అధికారులు, పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

కాశినాయన:రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జేసీ అదితి సింగ్ పేర్కొన్నారు. బుధవారం తహసీల్దారు కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓలు, సర్వేయర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, తహసీల్దారు నరసింహులు, ఆర్ఐ అమర్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

అడ్మిషన్ల జోరు.. తల్లిదండ్రుల బేజారు!

'హలో సార్... మీ పాప రమ్య పదవ తరగతి చదువుతున్నది కదా..! ఇంటర్‌కు ఏం ప్లాన్ చేస్తున్నారు సార్? మాది ఫలానా కార్పొరేట్ కాలేజీ. ఐఐటీ, ఎంసెట్ కోచింగ్, ఏసీ, నాన్ ఏసీ స్పెషల్ బ్యాచ్‌లు ఉన్నాయి. హాస్టల్ సౌకర్యం కూడా ఉంటుంది. ఇప్పుడు జాయిన్ అయితే ఫీజులో కొంత డిస్కౌంట్ ఉంటుంది. పరీక్షల తర్వాత సీట్లు కష్టం. అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఫీజులు పెరుగుతాయి. ముందుగా సీటు రిజర్వ్ చేసుకుంటే బాగుంటుంది. ఒకసారి కాలేజీ క్యాంపస్‌ను విజిట్ చేసి చూడండి '.



'సార్ గుడ్ ఈవినింగ్, సురేష్ ఫాదరేనా? మీ అబ్బాయి ఇంటర్మీడియట్ చదువుతున్నాడు కదా. బీటెక్ కోసం ఏం ప్లాన్ చేశారు. తమిళనాడు, కేరళలోని ఫలానా యూనివర్సిటీల్లో బీటెక్ కంప్యూటర్ సైన్సు, ఏఐఎంఎల్, డేటా సైన్సు, మెకానికల్ తదితర కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి.. ఆసక్తి ఉంటే చెప్పండి... రాయితీలు ఇప్పిస్తాం'...

- పరీక్షల కంటే ముందే అడ్మిషన్ల కోసం తంటాలు
- ఇంటర్, ఇంజినీరింగ్ కోర్సుల పేరిట ముందస్తు దోపిడీ
- తల్లిదండ్రులకు పెరిగిన ఫోన్ల తాకిడి

మదనపల్లె సిటీ: టెన్త్, ఇంటర్ చదవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఇప్పుడు ఇలాంటి ఫోన్ల బెడద పెరిగింది. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి , ఇంటర్మీ డియట్ కు సంబంధించి వేలాది మంది రాస్తున్నారు. కనీసం వార్షిక పరీక్షలు కూడా పూర్తి కాకముందే కార్పొరేట్ కాలేజీలు ప్రధానంగా కడప, ప్రొద్దుటూరు, మదనపల్లె, రాయచోటి, రాజంపేటతో పాటు మండల కేంద్రాల్లో సైతం బేరసారాలు ప్రారంభించాయి. అడ్డగోలు ఫోన్లు, ఆఫర్లతో తల్లిదండ్రులను అయోమయానికి గురి చేస్తున్నాయి. పరీక్షలు కూడా రాయకుండా అడ్మిషన్లు ఎలా తీసుకోవాలి... తీసుకోకుంటే ఫీజులు ఇంకా పెరుగుతాయేమో అని వారు ఆందోళనకు గురవుతున్నారు. అనుమతి లేకుండా విద్యార్థుల డేటాను సంపాదించి వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తూ వల విసురుతున్నారు. ఫోన్లు కాకుండా వాట్సాప్‌లకు అడ్మిషన్ల మెసేజ్‌లు పంపుతున్నారు. వీటికి ఎక్కువగా తల్లిదండ్రులు ప్రభావితమవుతున్నారు. ముందుగా మేల్కోకుంటే ఫీజులు ఎక్కడ పెంచుతారోనని వారు ఆందోళన చెందుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని అందిన కాడికి దోచుకునేందుకు కార్పొరేట్ ఇంటర్, ఇంజినీరింగ్ కాలేజీలు గాలం వేస్తున్నాయి. ఆకట్టుకునేలా బ్యాచ్‌కో పేరు పెట్టి రంగు రంగుల బ్రోచర్లు చూపి మంచి భవిష్యత్తు అంటూ ఆశల పల్లకిలో విహరింపజేస్తూ రూ.లక్షల్లో ఫీజులు బాదేస్తున్నారు.

మరో వైపు పీఆర్‌ఓలు...

తిరుపతి, విజయవాడ కేంద్రాల కార్పొరేట్ కాలేజీల తరపున వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్ల కోసం ఆయా విద్యా సంస్థల పీఆర్‌ఓలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రంగంలోకి దిగారు. విద్యార్థుల తల్లిదండ్రులు కొద్దిగా ఆసక్తి కనబర్చినా చాలు విద్యార్థుల ఇళ్ల వద్దకు క్యూ కడుతున్నారు. నామినల్ రోల్ ద్వారా విద్యార్థుల వివరాలు, ఫోన్ నంబర్లు, చిరునామా సేకరిస్తున్నారు. వాటి కోసం సంబంధిత విభాగాల ఇన్‌చార్జిలకు విందులు, నజరానాలు సమకూర్చుతున్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థుల వివరాలు ఎవరికి ఇవ్వరాదు. కానీ కాసులకు కక్కుర్తి పడి కింది స్థాయి సిబ్బంది కొందరు విద్యార్థుల సమాచారం అందిస్తున్నారు. దీంతో పీఆర్‌ఓ ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి బ్రోచర్లు ఇవ్వడం.. కాలేజీల గురించి వివరిస్తూ తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అడ్మిషన్లు ఎక్కువగా చేసిన వారికి ఇన్సెంటివ్ అవకాశం ఉండటంతో పోటీ పడుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

సాధారణంగా పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాలు వెలువడిన తర్వాతే అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాల ప్రక్రియ నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇక ఈ సారి గత ఏడాది కంటే ఫీజులు అధికంగా చెబుతున్నట్లు తెలుస్తోంది. కనీసం 20 శాతం అధికంగా ఫీజుల దోపిడీకి కాలేజీలు సిద్ధమయ్యాయి.

చికెన్, గుడ్లను నిర్భయంగా తినొచ్చు

- జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ

కడప అగ్రికల్చర్: జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని మాంస ప్రియులు చికెన్, గుడ్లను బాగా ఉడికించుకుని నిర్భయంగా తినొచ్చని జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ సూచించారు. బుధవారం నగరంలోని రాజీమార్ మార్గ్‌లో కలెక్టర్ ఆదేశానుసారం బర్డ్‌ఫ్లూపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బర్డ్ ఫ్లూపై వస్తున్న వదంతాలను ఎవరు నమ్మొద్దన్నారు. జిల్లాలో ఎక్కడ బర్డ్‌ఫ్లూ లేదన్నారు. ఈ విషయమై జిల్లాలో రాపిడ్ రిస్కు టీమ్స్‌ను ఏర్పాటు చేసి ప్రతి మండలంలో ప్రజలకు సూచనలు, సలహాలను ఇస్తున్నామని వివరించారు. అనంతరం చికెన్ లాలిపాప్స్‌ను తెప్పించి పశువైద్యాధికారులు తినడంతోపాటు అక్కడకు హాజరైన జనాలకు తినిపించారు. జిల్లాలోకి చనిపోయిన కోళ్లు సరఫరా కాకుండా ఉండటానికి మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్టు, మైనింగ్, పోలీసు చెక్ పోస్ట్ వారికి గట్టి ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు, పీవీపీ ఏడీలు రంగస్వామి, సుబ్బరాయుడు, పశువైద్యాధికారి డాక్టర్ అనుపమ, జేవీఓ రాజశేకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అన్నదమ్ముల ఘర్షణ

కాశినాయన : మండలంలోని పాపిరెడ్డిపల్లె గ్రామంలో ఘర్షణ పడిన అన్నదమ్ములు బోడె పాటి శ్రీను, సుబ్బయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. శ్రీను, సుబ్బయ్యలకు కలిపి మూడు ఎకరాలు భూమి ఉందని, భాగ పరిష్కారాలు కుదరక కోర్టుకు వెళ్లారని తెలిపారు. కోర్టులో కేసు నడుస్తుండగా శ్రీను బుధవారం ఆ పొలంలో షెడ్డు వేసేందుకు వెళ్లాడన్నారు. కోర్టులో కేసు నడుస్తుండగా రేకుల షెడ్డు ఎలా వేస్తావని సుబ్బయ్య అనడంతో మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పది టిప్పర్లు సీజ్

దువ్వూరు : దువ్వూరు గుట్ట నుంచి అక్రమంగా సుద్దను తరలిస్తుండగా.. పది టిప్పర్లు, పొక్లెయిన్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తహసీల్దారు అక్బల్‌బాషా తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గత రెండు రోజుల నుంచి మైదుకూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి టిప్పర్లతో అక్రమంగా సుద్ద తరలిస్తున్నారని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా, మెగా ఇంజినీరింగ్ సంస్థ సుద్ద రవాణా చేస్తోందన్నారు. దీంతో పట్టుకుని పది టిప్పర్లను పోలీసుస్టేషన్‌కు తరలించామని, ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో దొంగలు

లింగాల : మండలంలోని వెలిదండ్ల సమీపంలోని చీని తోటలో ఆరు బస్తాల చీని కాయలు చోరీ చేస్తున్న దొంగలను పట్టుకుని రైతులు పోలీసులకు అప్పగించారు. స్థానికుల వివరాల మేరకు.. మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చీనీ కాయలు చోరీ చేస్తున్న దొంగలను రైతులు గమనించారు. వారు పరారవుతుండగా వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. చీనీ కాయలతోపాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైర్లను దొంగలించినట్లు రైతులు తెలిపారు. లింగాల, బోనాల గ్రామాలకు చెందిన నలుగురు దొంగలతోపాటు, స్కూటీ, ఆటోను పోలీసులకు అప్పగించినట్లు రైతులు తెలిపారు. దీనిపై పోలీసులు విచారిస్తున్నారు.

ఉరివేసుకుని బాలిక ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పిఎస్ పరిధిలో రామకృష్ణ నగర్‌లో నివాసం వుంటున్న చిన్నం రమేష్ కుమార్తె జాహ్నవి (15) కుటుంబ సమస్యలతో బుధవారం ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పదో తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దే వుంటున్న బాలిక ఈ చర్యకు పాల్పడిందని తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● రుణమో.. రామచంద్రా!



చంటిపాపతో దరఖాస్తు దారులు

వివిధ కార్పొరేషన్ రుణాల మంజూరుకు సంబంధించి పట్టణంలోని కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో బుధవారం దరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలు జరిగాయి. పెద్ద ఎత్తున దరఖాస్తు దారులు తరలి రావడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రులు అవస్థలు పడ్డారు. కొందరు చేసేదిలేక ఎక్కడబడితే అక్కడ కూర్చుని దరఖాస్తులో లోపా లు సరిదిద్దుకున్నారు. వందల మంది రావడంతో ఆవరణంటా కిటకిటలాడింది. – సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్



కిటకిటలాడుతున్న కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణం



కేంద్రం వద్ద అభ్యర్థుల అవస్థలు



వినతులను పరిశీలిస్తున్న అధికారులు



రోడ్డుపైనే ఫారాలను నింపుతూ దరఖాస్తుదారుల అవస్థ



గేట్లు వేసేస్తున్న పోలీసులు, మున్సిపల్ సిబ్బంది



తలి ఇంటర్వ్యూకు వెళ్లడంతో చంటి పిల్లలతో కుటుంబసభ్యులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

తిరుపతి రూరల్ : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రాహదారిపై బుధవారం అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతి రూరల్ మండలం రామనుజపల్లి చెక్‌పోస్టు దాటిన తర్వాత జాతీయ రహదారిపై (ఏపీ 40 ఏజే 0595) నంబర్ గల ద్విచక్ర వాహనం (స్కూటీ)పై వైఎస్సార్ జిల్లాకు చెందిన సాహిర్ బాషా, యువతితో కలసి వెళ్తుండగా.. ఆర్‌సీపురం జంక్షన్‌నుంచి ఉప్పరపల్లి వైపు రాంగ్ రూట్లో వస్తున్న టిప్పర్ (ఏపీ39 యూఈ 0240) ఢీ కొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అవమానించిందని మహిళ హత్య

నిందితుడిని అరెస్టుచేసిన పోలీసులు



హత్య కేసు నిందితుడితో సీఐ, ఎస్ఐలు

వేముల : మండలంలోని కె.కె.కొట్టాల సమీపంలో ఈ నెల 2న జరిగిన సింగంశెట్టి పద్మావతి హత్య కేసును పోలీసులు చేధించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ ఉలసయ్య, ఎస్సై ప్రవీణ్ కుమార్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. కె.కె.కొట్టాల గ్రామానికి చెందిన సింగంశెట్టి పద్మావతి గ్రామ సమీపంలో ఎనుములు మేపుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి వెళ్లారన్నారు. పద్మావతిని చంపి ఆమె శరీరంపై ఉన్న బంగారు గొలుసు, చెవి కమ్మలు ఎత్తుకెళ్లారన్నారు. మృతురాలి కుమార్తె గోగుల దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బృందాలుగా ఏర్పడి నిందితుల ఆచూకీ కోసం గాలించామని తెలిపారు. మృతురాలు సింగంశెట్టి పద్మావతి తనను అవమానకరంగా మాట్లాడుతుండడంతో చంపాలని సింగంశెట్టి రమేష్ నిర్ణయించుకున్నాడన్నారు. ఈ నెల 2న ఎనుములు మేపుకొనేందుకు పద్మావతి వెళ్లగా.. అక్కడికి వెళ్లిన రమేష్ చేతులకు ప్లాస్టిక్ గ్లౌజులు ధరించి తలపై దాడిచేసి చంపాడన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆభరణాల కోసం చంపారనుకునేలా మెడలో బంగారు గొలుసు, చెవి కమ్మలు అపహరించాడన్నారు. బుధవారం ముద్దాయి సింగంశెట్టి రమేష్‌ను అరెస్టు చేసి అతని వద్ద బంగారు గొలుసు, చెవి కమ్మలను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు వారు తెలిపారు.

చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణం, లాకప్ గదులు, రికార్డులను పరిశీలించారు. మహిళలకు సంబంధించిన కేసులను త్వరగా పరిశీలించి న్యాయం చేయాలని, రికార్డులు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి బ్లాక్ స్పాట్స్ బోర్డులు ఏర్పాటుచేయాలని తెలిపారు. మట్కా, క్రికెట్, బెట్టింగ్ తదితర నేరాల పట్ల కఠినంగా వ్యవహరించవలసిందిగా ఆదేశించారు. ఎస్పీ వెంట ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్, ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

ఆధ్యాత్మిక అంశాలకు నెలవు రామాయణం



మాట్లాడుతున్న మేడసాని మోహన్

కడప కల్చరల్ : సామాజిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక అంశాలకు రామాయణం నెలవని పంచ సహస్రావధాని డాక్టర్ మేడసానిమోహన్ అన్నారు. వైవీయూలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ×తెలుగులో రామాయణాలు–సామాజిక దృక్పథం₹ అంశంపై జరుగుతున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో భాగంగా బుధవారం సాయంత్రం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ మేడసాని మోహన్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి చిత్రించిన రాముడు గురువులకు గురువని, ఆచరణశీలుడని అన్నారు. రామాయణ కల్పవృక్షంలో శివధనుర్భంగం సందర్భాన్ని విశ్వనాథ ఉదాత్తంగా చిత్రించారన్నారు. ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ రాముని వల్ల రఘువంశం కీర్తింబడిందని ప్రజాకవి వేమన అన్నారన్నారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి మాట్లాడుతూ రామాయణంలో రాముడు అనేక కష్టాలు ఎదుర్కొన్నాడని, కానీ నేటి యువత చిన్న చిన్న సమస్యలకే డీలాపడుతున్నారన్నారు. జానమద్ది విజయ భాస్కర్ మాట్లాడుతూ గతంలో కడపజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గొప్పగా మహాసభలు నిర్వహించారని, ఈ రెండు రోజుల సదస్సు నాటి సభలను తలపింపజేశాయన్నారు. ఈ సదస్సుల్లో 80 మంది దేశ, విదేశాల ప్రతినిధులు, పత్ర సమర్పకులు వివిధ అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.పార్వతి, డాక్టర్ నరాల రామారెడ్డి, ఆచార్య పేట శ్రీనివాసులరెడ్డి, ఆచార్య సంగనభట్ల నరసయ్య, ఆచార్య జి.బాలసుబ్రహ్మణ్యం, ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి, డా కె.రవిబాబు, డా టి.ఎస్.వెంకటేశ్, డా ఎస్.మమత, డాక్టర్ పి.లోకేశ్వరి, డా భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంటశివారెడ్డి, ఆచార్య డి.విజయలక్ష్మి, ఆచార్య టి.రామప్రసాద రెడ్డి, ఆచార్య జి.దామోదర నాయుడు, ఆచార్య ఎంఎం వినోదిని, జస్టిస్ పసుపులేటి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అరటి తోటకు నిప్పు.. రూ.3 లక్షల నష్టం

వేంపల్లె : వేంపల్లె పట్టణ పరిధిలోని చింతలమడుగుపల్లె సమీపంలో కొందరు ఆకతాయిలు తన అరటి తోటకు నిప్పుపెట్టినట్లు ఎర్రబోయిన రవి తెలిపారు. బాధితుడి వివరాల మేరకు.. చక్రాయపేట మండలం సిద్దారెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన ఎర్రబోయినరవి వేంపల్లె మండలం చింతలమడుగుపల్లె గ్రామ పొలాల్లో మూడు ఎకరాల్లో అరటితోట సాగు చేస్తున్నారు. ఈ తోటకు సమీపంలో కొందరు ఆకతాయిలు చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే రెండెకరాల్లో అరటి చెట్లు, ప్లాస్టిక్ పైపులు, డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. కాలిపోయిన అరటి పంటను హార్టికల్చర్ సిబ్బంది శివ పరిశీలించారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం అందించాలని కౌలు రైతు కోరారు.

అగ్నికి ఆహుతైన అరటి

పులివెందుల రూరల్ : గుర్తు తెలియని వ్యక్తులు బీడు భూమికి నిప్పంటించడంతో మంటలు వ్యాపించి అరటి తోటలో 46 చెట్లు దగ్ధమయ్యాయి. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వెలమవారిపల్లెకు చెందిన రైతు చంద్రశేఖర్ నాయుడు ఎరబ్రండ కొత్తపల్లిలో ఆరు ఎకరాల్లో అరటి పంట సాగు చేశాడు. తోట పక్కన బీడు భూమి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డికి నిప్పంటించారు. మంటలు వ్యాపించి రైతుకు చెందిన అరటిచెట్లు దగ్ధమయ్యాయి. సుమారు రూ.60 వేల పంట నష్టం జరిగిందని రైతు చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతును ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏపీజీబీ కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి

ప్రభుత్వానికి లేఖ రాసిన మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా



కడప కార్పొరేషన్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్ బాషా కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం ఆయన లేఖ రాశారు. రైతులు, కర్షకులు, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఆ బ్యాంకు, రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. రాయలసీమ గ్రామీణ బ్యాంకు, అనంత గ్రామీణ బ్యాంకు, పినాకినీ గ్రామీణ బ్యాంకులు ఐదు జిల్లాలకు సంబంధించి ఉండేవని, రాయలసీమ గ్రామీణ బ్యాంకు కడప కేంద్రంగా ఉండేదన్నారు. ఈ బ్యాంకు ఎక్కువ టర్నోవర్ సాధించడంతో కడపలో ప్రధాన కార్యాలయం ఏర్పాటుచేశారన్నారు. ఇప్పుడు 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను 28 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులుగా కుదించడంతో కడపలోని ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఈ ఆలోచనలను ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలన్నారు. దేశంలోని 43 ప్రాంతీయ బ్యాంకుల కన్నా ఏపీజీబీ 552 శాఖలతో, రూ.50 వేల కోట్ల టర్నోవర్‌తో, రూ.802 కోట్ల లాభాలతో, రూ.4591కోట్ల రిజర్వ్‌తో వ్యాపారాభివృద్ధిలో మిగతా బ్యాంకుల కన్నా అగ్రభాగాన ఉందన్నారు. ఈ బ్యాంకులో 2800 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలోని హైకోర్టు, లా యూనివర్సిటీ, ఎంఎస్ఎంఈ కేంద్రం, గతంలో అనంతపురానికి రావాల్సిన ఎయిమ్స్‌ను ఇతర ప్రాంతాలకు తరలించి అన్యాయం చేశారన్నారు. వ్యాపారం, టెక్నాలజీ, ఆర్‌బీఐ అనుమతించిన ప్రత్యేకమైన కరెన్సీ, చెస్ట్ సౌకర్యం, సొంత భవనాలు ఏపీజీబీకే మిగతా వాటికంటే మిన్నగా ఉన్నాయన్నారు. 2006లో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కడపలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయానికి 0.50 సెంట్ల స్థలానికి కేటాయించగా, మరియాపురం వద్ద రూ.15 కోట్లతో ఈ భవనాన్ని నిర్మించారన్నారు. రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేయాలని ఆయన కోరారు.

రాజకీయ ఒత్తిళ్లతో చెక్ పవర్ రద్దు చేసే యత్నం

డీపీఓ కార్యాలయం ఎదుట సర్పంచ్ నిరసన



కడప సెవెన్‌రోడ్స్ : అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి తన చెక్ పవర్ రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని వీఎన్.పల్లె మండలం బుసిరెడ్డిపల్లె పంచాయతీ సర్పంచ్ లింగారెడ్డి అనూరాధ ఆరోపించారు. ఆమె భర్త, రాష్ట్ర మైనింగ్ మాజీ డైరెక్టర్ ఎల్.వీరప్రతాప్‌రెడ్డితో కలిసి డీపీఓ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనూరాధ మాట్లాడుతూ బుసిరెడ్డిపల్లె నుంచి గంగనపల్లె వరకు లక్షా 14 వేల రూపాయలతో గ్రావెల్ రోడ్డు నిర్మించామని, ఏఈ సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. బిల్లు ఇంతవరకూ తీసుకోలేదన్నారు. రోడ్డు పనుల్లో తాము అవినీతికి పాల్పడ్డామని అధికార పార్టీకి చెందిన లైన్‌మెన్ ప్రసాద్‌రెడ్డి, నల్లబల్లె రమణారెడ్డి డీపీఓకు ఫిర్యాదు చేశారన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన డీపీఓ రాజ్యలక్ష్మి విచారణ బాధ్యతను పులివెందుల డివిజనల్ పంచాయతీ అధికారికి అప్పగించారన్నారు. తమది ఫ్యాక్షన్ గ్రామమని, డీపీఓ వైఖరి కారణంగా కక్షలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఇదే వైఖరి కొనసాగితే తాను, తన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామన్నారు. ఈ విషయాన్ని తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నివేదిక ఆధారంగా చర్యలు : డీపీఓ

పులివెందుల డీఎల్‌పీఓను విచారణకు నియమించామని, నివేదిక పరిశీలించిన తర్వాత చర్యలు చేపడతామని డీపీఓ రాజ్యలక్ష్మి వివరణ ఇచ్చారు. అభియోగాలు రావడం సహజమని, ఆడిట్ జరిగిందా? లేదా? అనే దానితో సంబంధం లేదని తెలిపారు. తమపై రాజకీయ ఒత్తిళ్లు లేవని, చట్ట వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు చేపట్టబోమన్నారు. తప్పు జరిగిఉంటే ఏఈ బాధ్యులవుతారని తెలిపారు.

బంగారం రికవరీ పేరిట మాకు వేధింపులా?

కడప జ్యువెలర్స్ దుకాణదారుల ఆవేదన



మీడియాతో మాట్లాడుతున్న జరుగు రాజశేఖర్‌రెడ్డి

కడప కల్చరల్ : చోరీ జరిగిన బంగారాన్ని రికవరీ చేయడం పేరిట బంగారు దుకాణ యజమానులను వేధించడం సమంజసం కాదని కడప జ్యువెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జరుగు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వైవీ స్ట్రీట్‌లో కడప జ్యువెలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడుతూ గత కొద్దికాలంగా పోలీసు యంత్రాంగం తమను ఇబ్బందులకు గురిచేస్తోందని, కడపలోని ఏ నగల దుకాణ వ్యాపారి దొంగ బంగారాన్ని కొనుగోలు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బంగారు కొనుగోలు విషయంలో ఇలాంటి అనర్థాలు వస్తాయనే విషయం తమకు తెలుసని, అందుకే ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. దొంగ బంగారం కొనుగోలు చేసినట్లు పెద్ద మొత్తంలో రికవరీ చేస్తుండడంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. ఎవరికైనా ఇలాంటి సమస్యలు వస్తే అసోసియేషన్‌లో సంప్రదించాలని, సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యువెలర్స్ అసోసియేషన్ నాయకులు, బంగారు దుకాణాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

జ్యువెలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జరుగు రాజశేఖర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులుగా సయ్యద్ సలావుద్దీన్, ఆకుల రాజమోహన్, కార్యదర్శిగా సయ్యద్ చాంద్‌బాష, కోశాధికారిగా ఆకుల రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. వీరితోపాటు ఐదుగురు జాయింట్ సెక్రటరీలు, మిగతా కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాజీ సీఎం జగన్ రక్షణ.. కూటమి ప్రభుత్వానికి పట్టదా?



మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట : మిర్చి రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కనీస రక్షణ కల్పించాల్సిన కూటమి ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించిందని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు మిర్చియార్డు రైతుల సమస్య తెలుసుకునేందుకు వెళ్లిన జగన్‌కు కనీసం ఒక్క పోలీసును కూడా రక్షణకు నియమించక పోవడం, కనీసం ట్రాఫిక్ క్లియరెన్స్ చేయక పోవడం దురదృష్టకరం అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయలేదని ఎవ్వరికీ మద్దతు ఇవ్వలేదని అన్నారు. అలాంటప్పుడు ఎన్నికల ఆంక్షలు ఎలా వర్తిస్తాయని ప్రశ్నించారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు కనీసం రూ.20వేలు రైతు భరోసాను అందించలేక పోవడం కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

అధికార పార్టీ అండతో ఇంటి స్థలం ఆక్రమణ



కోర్టు వివాద స్థలంలో జరుగుతున్న నిర్మాణం

కడప సెవెన్‌రోడ్స్ : అధికార తెలుగు దేశం పార్టీ నాయకుల అండ చూసుకుని తమ గ్రామానికి చెందిన పెరుగు నాగమ్మ, ఇతరులు తన ఇంటి స్థలం ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని మైదుకూరు మండలం నంద్యాలంపేట గ్రామానికి చెందిన చిన్న పాలయ్య బుధవారం కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరికి ఫిర్యాదు చేశారు. నంద్యాలంపేట గ్రామ పొలం సర్వే నెంబరు 290/ఎలో ఎనిమిదిన్నర సెంట్ల ఇంటి స్థలం ఉందన్నారు. దీనిపై మైదుకూరు సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరుగుతోందన్నారు. ఒకవైపు విచారణ ముగిసి న్యాయస్థానం తీర్పు వెలువడకముందే టీడీపీ నాయకులు దౌర్జన్యంగా స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. తాము అభ్యంతరం చెప్పగా దౌర్జన్యానికి దిగుతున్నారని, పోలీసుస్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. కోర్టు తుది తీర్పు వచ్చే వరకు ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని, ఎవరికీ ప్రవేశం లేకుండా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

డీఏఓ అయితా నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్ : ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంపొందించి ఔత్సాహిక రైతులను ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు సూచించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో ప్రకృతి వ్యవసాయం అమలు తీరు, విస్తరణపై ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాలను కల్పించడంలో వైఎస్ఆర్ జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉందని తెలిపారు. సంప్రదాయ వ్యవసాయ సాగు పద్ధతులను అమలు చేసేందుకు.. గ్రామాలను యూనిట్లుగా తీసుకుని వీవోలు, స్వయం సహాయక సంఘాల సభ్యులను భాగస్వామ్యం చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో... న్యూట్రీ గార్డెన్స్ ఏర్పాటుకు మ్యాపింగ్ చేయాలన్నారు. ఎస్.వి.ప్రవీణ్ కుమార్, ఆనంద్‌నాయక్, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ధాత్రి పురస్కారాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కడప కల్చరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిభ గల మహిళలకు 2025 సంవత్సరానికి గానూ ధాత్రి పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు చేయనున్నామని వివేకానంద ఫౌండేషన్ అధ్యక్షులు పాపిజెన్ని రామకృష్ణ తెలిపారు. సామాజిక సేవ చేస్తున్నా, మహిళా అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్న ఆంధ్ర మరియు తెలంగాణ మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 28 వ తేదీ లోపు దరఖాస్తులను పంపాలన్నారు. వివరాలకు 8897292237 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.